సాక్షి ప్రకాశం

బుధవారం ; 19 ; మార్చి ; 2025



రంగ రంగా..వికృతంగా..

ఆరో తరగతి చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడటంతో బాధితురాలి బంధువులు నిరసనకు దిగారు. - 8లో..



జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురంలో జంట హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
39/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

బుధవారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 29	
గురువారం	సహరి	
ఉదయం	గం 4 : 56	

న్యూస్‌రీల్

ప్రావిడెంట్ ఫండ్‌ను వెంటనే ఇప్పించాలి



పౌరసరఫరా అధికారులకు వినతి పత్రం అంజేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్ర పౌరసరఫరా సంస్థలో హమాలీలుగా పనిచేసి చనిపోయిన, రిటైర్డ్ అయిన, మానుకున్న వారికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇప్పటి వరకు మరణించిన 9 మంది కార్మికుల కుటుంబాలకు పీఎఫ్, పెన్షన్ ఇప్పించడంలో అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హమాలీలు శ్రీనివాసరెడ్డి, శేషయ్య, సుబ్బారావు, నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, రంగయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యానికి స్కోచ్ అవార్డు

ఒంగోలు సిటీ: జిల్లాలో బాల్యవివాహాలను నివారించి బంగారు బాల్యానికి బాటలు వేసేలా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు లభించింది. బాల్య వివాహాల్లో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉండటంతో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ.తమీమ్ అన్సారియా సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను ఇందులో భాగస్వాములను చేస్తూ 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని రూపొందించారు. త్వరలోనే న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఈ అవార్డు అందుకోనున్నారు. అవార్డు సాధించిన కలెక్టర్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అభినందనలు తెలిపారు.

మాటల మంట..
కూటమి తంట!

''రాజకీయంగా జనసేన పార్టీ నిలదొక్కుకోవడమే కాకుండా, 40 ఏళ్ల చరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీని కూడా నిలబెట్టాం'' అంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో చేసిన వ్యాఖ్యలు జిల్లా కూటమిలో చిచ్చు రేపింది. పవన్ లేకపోతే టీడీపీ ఉండేది కాదు అని మాట్లాడటం సమంజసం కాదు అంటూ తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ మా వల్లే గెలిచాడంటూ కౌంటర్ ఇస్తున్నారు. దీనిపై జనసేన కార్యకర్తలు సైతం సోషల్ మీడియా వేదికగా టీడీపీపై విరుచుకుపడుతున్నారు. ఇదే అంశంపై జిల్లాలో అక్కడక్కడా చిన్నపాటి ఘర్షణలు సైతం చోటుచేసుకోడం గమనార్హం.



- పవన్ వ్యాఖ్యలతో జిల్లా టీడీపీ, జనసేనల్లో అలజడి
- 40 ఏళ్ల టీడీపీని నిలబెట్టింది నేనే అంటూ చేసిన ప్రకటనపై అభ్యంతరాలు
- టీడీపీ, జనసేన కార్యకర్తల నడుమ సోషల్ మీడియా వార్
- జనసేనతో పొత్తు 95 శాతం టీడీపీ కార్యకర్తలకు ఇష్టం లేదని తెలుగు తమ్ముళ్ల ఎదురుదాడి
- రాజమండ్రి సెంట్రల్ జైలులో ప్రపంచ మేధావి చొక్కా తడిసిందంటూ జనసేన పోస్టులు
- కులహంకారంతో మాట్లాడుతున్నారంటూ టీడీపీ వారిపై ఆగ్రహం
- కారుకూతలు కూస్తే కంఠం తెగుద్దంటూ తమ్ముళ్లకు హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య పరిస్థితి ఉప్పు నిప్పులా తయారైంది. ఇరుపార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటూ దుమ్మెత్తిపోసుకుంటున్నారు. ఒకరిపై మరొకరు కామెంట్లు చేసుకుంటూ మంటలు రాజేస్తున్నారు. కులం ప్రస్తావనలు సైతం తీసుకొస్తున్నారు. దీంతో కూటమి నేతలు, కార్యకర్తల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని చెప్పవచ్చు. అసలే జిల్లాలో టీడీపీ, జనసేనల మధ్య అంతంత మాత్రంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు మరింత దిగజారినట్లు తెలుస్తోంది.

కారుకూతలు కూస్తే కంఠం తెగుద్ది...

టీడీపీ, జనసేన మధ్య సోషల్ మీడియాలో జరుగుతున్న వార్ నేపథ్యంలో చెరుకూరి ఫణికుమార్ అనే జనసేన కార్యకర్త విడుదల చేసిన ఆడియో సంచలనం రేకెత్తించింది. టీడీపీ నాయకుల పిచ్చి పిచ్చి కామెంట్లు వినదలచుకోలేదని చెప్పిన ఆయన కారుకూతలు కూస్తే కంఠం తెగుద్దని హెచ్చరించడంతో వివాదం మరింత ముదిరినట్లు కనిపిస్తోంది. మద్యం దుకాణాలు ఇవ్వకపోయినా, రేషన్ దుకాణాలు ఇవ్వకపోయినా, రోడ్డు కాంట్రాక్టులు ఇవ్వకపోయినా అడగడం లేదని, జనసేన మీద కామెంట్స్ చేస్తే మాత్రం సహించేది లేదని కుండబద్దలు కొట్టాడు. టీడీపీలోని అధికార పార్టీకి చెందిన సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా జనసేన కార్యకర్తలను తూలనాడుతున్నారని, కులహంకారంతో ప్రవర్తిస్తే బాగుండదని హితవు పలికాడు. ప్రపంచ మేధావి అని చెప్పుకునేవాళ్లు చొక్కాలు నలిగి రాజమండ్రి జైల్లో ఎలా ఉన్నారో అంటూ అవినీతి కేసులో అరెస్టయిన చంద్రబాబు గురించి ప్రస్తావించిన ఆయన మళ్లీ అలా ఉండడానికి ఇష్టమైతే మాతో గొడవ పెట్టుకోండని సలహా ఇచ్చాడు. ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రవర్తించకపోతే, కులహంకారంతో రెచ్చిపోతే టీడీపీ గతి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని అనడం వివాదానికి మరింత అగ్గిరాజేసినట్లయింది. 2019లో పొత్తు పెట్టుకోకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, అలాంటి పరిస్థితి పునరావృతమైతే ఇంటి నుంచి బయటకు కూడా రాలేరని చెప్పడం చర్చనీయాంశమైంది. ఈ ఆడియో జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది.

సింగరాయకొండలో టీడీపీ భూ కబ్జాపై ఫిర్యాదు..

కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండలో తెలుగుదేశం నాయకులు భూ కబ్జాకు చేసిన ప్రయత్నాలపై జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని బాలుర వసతి గృహం వెనక సోమరాజుపల్లి లో సర్వే నెంబర్ 686లో మిగిలి ఉన్న 1.50 సెంట్ల స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేసి అక్రమంగా విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ స్థలంలో గృహనిర్మాణాలు చేస్తున్నట్టు సమాచారం. టీడీపీలోని పెద్ద తలకాయల అండదండలతో అధికారుల నోళ్లు మూయించిన పచ్చ ముఠాపై జనసేన ఫిర్యాదు చేయడం కూటమి పార్టీల మధ్య విభేదాలకు ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పవచ్చు.

ఒంగోలులో మూడు ముక్కలాట...

జిల్లా కేంద్రమైన ఒంగోలులో జనసేన పార్టీలో మూడు ముక్కలాట కొనసాగుతోంది. రియాజ్ జనసేన, అరుణ జనసేన, బాలినేని జనసేనలుగా విడిపోయింది. రియాజ్ వర్గం మొదట్నుంచి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో ఉంటుండగా, అరుణ ప్రస్తుతం బాలినేని వర్గంతో సానుకూలంగా వ్యవహరిస్తోంది. బాలినేని పేరు వింటేనే చాలు తెలుగుదేశం పార్టీ నాయకులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. నువ్వు ఏ పార్టీలో చేరినా నిన్ను దేవుడు కూడా రక్షించలేరని ఎమ్మెల్యే దామచర్ల బహిరంగంగానే హెచ్చరించిన నేపథ్యంలోనే బాలినేనిని ఒంగోలులో అడుగుపెట్టకుండా కట్టడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గిద్దలూరు నుంచి పోటీ చేయడానికి ప్రయత్నించి విఫలమై టీడీపీ మీద తీవ్రమైన విమర్శలు చేసిన ఆమంచి స్వాములు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. అధికార టీడీపీ నాయకుల తీరుపై మండిపడిన బెల్లంకొండ సాయిబాబా పత్తా లేకుండా పోయాడు. ఒంగోలు నగరంలో టీడీపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న జడా నాగేంద్ర కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అంటే టీడీపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నాయకులను ఏదో రకంగా అణిచివేస్తున్నట్లు జనసేన కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో తమకు కార్పొరేషన్ పదవులు వస్తాయని చాలా మంది జనసేన నాయకులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రియాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా చెప్పుకునే రాయపాటి అరుణ ఊహల్లో విహరించారు. ఆ ఇద్దరికి చివరికి మొండిచేయి చూపించడంతో మింగలేక కక్కలేక తెగ ఇబ్బంది పడిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ నాయకులు నమ్మించి మోసం చేసినట్లు ఈ ఇద్దరు నాయకులు సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం.

జనసేనతో పొత్తు ఇష్టం లేదు..

కూటమి గెలుపునకు మేం కారణమంటే.. కాదు మేం కారణమంటూ రచ్చకెక్కిన కూటమి కార్యకర్తలు సోషల్ మీడియాలో ఒకరికి వ్యతిరేకంగా మరొకరు పోస్టులు పెట్టుకుంటున్నారు. పిఠాపురంలో నిర్వహించిన జనసేన పార్టీ ఆవిర్భావ సదస్సులో టీడీపీని గెలిపించింది మనమే అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై పరోక్ష విమర్శలు చేస్తూ ''చాంపియన్ ట్రోఫీలో ఇండియాని గెలిపించింది నేనే అంటూ'' పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఒక టీడీపీ కార్యకర్త ఎఫ్‌బీలో కామెంట్ చేశారు. అంతే కాకుండా జనసేనతో పొత్తు పెట్టుకోవడం 95 శాతం టీడీపీ కార్యకర్తలకు ఇష్టం లేదంటూ పోస్టులు పెట్టారు. దీంతో సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన మధ్య వార్ ముదిరింది. ఒకరిపై ఒకరు కామెంట్లు చేసుకున్నారు.

జిల్లాలో టీడీపీ, జనసేన మధ్య పెరిగిన దూరం..

ఎన్నికల ముందు కలిసి పనిచేసిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన జిల్లా నాయకులు, కార్యకర్తల మధ్య అంతంత మాత్రంగా ఉన్న సంబంధాలు ఇటీవల కాలంలో మరింత దిగజారినట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన నాయకులు కూడా అక్రమ వ్యాపారాల్లో వాటాలను ఆశించారు. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ఎవరూ వీరిని దగ్గరకు రానీయడం లేదు. జనసేన నాయకులను కలుపుకునే ప్రయత్నాలు చేయడం లేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో జనసేన నాయకులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినా అప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి మొదలుకొని యర్రగొండపాలెం వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే మద్యం దుకాణాలు, రేషన్ అక్రమ సరఫరా, మైనింగ్ రవాణా చేసుకుంటున్నారని జిల్లా జనసేన నాయకులు వాపోతున్నారు. మా నోట్లో మట్టి కొడుతున్నారని లబోదిబోమంటున్నారు.

పొట్టి శ్రీరాములు మ్యూజియంతో మాకు సంబంధం లేదు

- పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగ ఆంజనేయులు

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో అమరజీవి నివాసాన్ని మ్యూజియంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ప్రభుత్వం నిర్మించే మ్యూజియంతో మాకు ఎలాంటి సంబంధం లేదని పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అమరజీవి పుట్టిన ఇల్లు తమ ఆధీనంలో ఉందని, సంఘం తరఫున కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నట్లు చెప్పారు. పొట్టి శ్రీరాములు జయంతి రోజున కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి పొట్టి శ్రీరాములు గుడి నిర్మాణం కోసం భూమి పూజ చేశామన్నారు. భూమి పూజ కోసం జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం పంపించినప్పటికీ ఏ ఒక్కరూ రాలేదని, కనీసం తహసీల్దార్ కూడా రాకపోవడం బాధ కలిగించిందన్నారు. 30 అడుగుల భవనం, దానిపై 25 అడుగుల విగ్రహంతో గుడి నిర్మాణం చేయడానికి కమిటీ తరఫున నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

జిల్లాలో 90 పంట కొనుగోలు కేంద్రాలు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ప్రభుత్వం ద్వారా కందులు, శనగలు, మినుములు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయటానికి రంగం సిద్ధం చేసింది. అందుకోసం జిల్లా వ్యాప్తంగా ఆయా మూడు రకాల పంటలకు సంబంధించి పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ వివరాలు వెల్లడించారు. జిల్లాలో కందులకు 45, శనగలకు 35, మినుములకు 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సంఘాల (పీఏసీఎస్)లో నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశారు, క్వింటాకు కందుల కనీస మద్దతు ధర రూ.7550, శనగలకు రూ.5650, మినుములకు రూ.7400 గా ప్రభుత్వం నిర్ణయించారు. ఈ- క్రాప్ లో కంది, శనగ, మినుములు నమోదైన అందరి రైతులు ప్రొక్యూర్‌మెంట్ కోసం వెంటనే రెండు రోజుల్లో సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. రైతులు తమ పేర్లను నమోదు చేసుకొనే సమయములో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలి. తద్వారా తమ సరుకును అమ్ముకొనే తేదీ రిజిస్టర్ మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుంది. తమ సరుకును అమ్మే సమయములో రైతులు తమ మొబైల్ నంబరు, ఆధార్, బ్యాంకుకు లింక్ అయిందో లేదో సరి చూసుకోవాలి. ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాల్లో పంట ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలి.



పిచ్చమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన వైఎస్ విజయమ్మ, వైవీ సుబ్బారెడ్డి, వైవీ భద్రారెడ్డి



వైఎస్ జగన్‌ను చూసేందుకు పోటెత్తిన జనసందోహం



నివాళులర్పిస్తున్న తాటిపర్తి, దద్దాల, అశోక్‌బాబు



తల్లి అంతిమయాత్రలో వైవీ సుబ్బారెడ్డి, భద్రారెడ్డి

వైవీ మాతృమూర్తికి
కన్నీటి వీడ్కోలు

- వైవీ సుబ్బారెడ్డి తల్లి అంత్యక్రియలకు మేదరమెట్లకు వచ్చిన జగన్
- సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- అర్ధగంటపాటు అక్కడే గడిపిన జననేత

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ సోమవారం ఒంగోలులో మృతిచెందగా స్వగ్రామం మేదరమెట్లలో ఆమె అంత్యక్రియలు మంగళవారం బంధువులు, పార్టీశ్రేణుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నాడని తెలుసుకొని వేలాదిగా కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్య జనమూ తరలి వచ్చారు. ఎంతగా అంటే జనం తాకిడికి జగన్ కాన్వాయ్ ముందుకు కదలలేకపోయింది. ఆ తర్వాత జగన్ వైవీ ఇంటికి చేరుకొని అక్కడ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డి, చిన్నమ్మ స్వర్ణమ్మ, చిన్నాన్నలు వైవీ భద్రారెడ్డి, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులందరినీ పలకరించి పరామర్శించారు. భుజంతట్టి ఓదార్చారు. అక్కడే ఉన్న తల్లి విజయమ్మ, మేనమామ రవీంద్రనాథరెడ్డి ఇతర బంధువులతో మాట్లాడారు. అర్ధగంట పాటు అక్కడే ఉన్న వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో గడిపారు. వైఎస్సార్ సీపీ నేతలను పేరుపేరునా పలకరించారు. వైవీ ఇంటి నుంచి జగన్ తిరుగు ప్రయాణంలోనూ ఆయన వాహనం ముందు చేరిన కార్యకర్తలు, అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. పిచ్చమ్మ భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా వెంకట రాంబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు, చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు.

ఆధార్‌కార్డుల నవీకరణ పటిష్టంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టరు గోపాలకృష్ణ రోణంకి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి

ఒంగోలు సిటీ: ఆధార్‌కార్డుల నవీకరణ ప్రక్రియ జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఆధార్‌కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియ పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, జీఎస్‌డబ్ల్యూ, పోస్టల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలన్నీ పని చేయాలన్నారు. కొత్తగా జన్మించిన శిశువుల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కు సంబంధించి బర్త్ రిజిస్ట్రేషన్ బేస్డ్ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అనే విధానాన్ని అవలంబించాలన్నారు. నవీకరణ ప్రక్రియపై ప్రజలకు తక్షణమే అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రి లేదా ఏ ఆస్పత్రిలో శిశువు జన్మించినా తక్షణమే ఆ శిశువు ఆధార్ నమోదు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ ఐడీ నమోదులో పెండింగ్ ఉండరాదని ఆదేశించారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ హేన సుజన, ఉదయ్ సంస్థ ప్రతినిధులు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శభాష్ ప్రణవి

- షూటింగ్‌లో రెండు రజతాలు సొంతం
- అభినందించిన ఎస్పీ దామోదర్



క్రీడాకారిణి ప్రణవిని అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: న్యూఢిల్లీలో గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి మాసాల్లో నిర్వహించిన 67వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల షూటింగ్(పిస్టల్) సీనియర్, జూనియర్ మిక్స్‌డ్ విభాగంలో కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామానికి చెందిన ద్వారం ప్రణవి సత్తా చాటి రెండు రజత పతకాలు సాధించింది. అలాగే ఖేలో ఇండియా యూనివర్శిటీ టోర్నమెంట్‌లో 4వ స్థానంలో నిలిచి ప్రతిభ చాటింది. ఆమెను మంగళవారం జిల్లా పోలీసు కార్యలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ప్రకాశం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు. ప్రణవి వెంట ఆమె తండ్రి జాలిరెడ్డి ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ



మాట్లాడుతున్న పీడీ నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: మండల సమాఖ్య రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ ఆదేశించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో జిల్లాలోని 38 మండలాల మండల సమాఖ్య అకౌంటెంట్లకు మంగళవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. సంస్థాగత నిర్మాణంలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ నెలలో అర్హులైన లబ్ధిదారులకు సీఫ్‌ను అప్పుగా మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు ఏ గ్రేడ్ పరిధిలోకి రావాలన్నారు. స్వయం సహాయక గ్రూపుల గ్రేడింగ్, సీఫ్ రికవరీలో ముందంజలో ఉండాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఉద్యోగులు నరసింహరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఒంగోలు సిటీ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఒకటికి నాలుగు శాఖలకు సంబంధించిన పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. అయినా పదోన్నతులు లేవని వాపోయారు. తమతో పాటు రిక్రూట్ అయిన సచివాలయ ఉద్యోగులు చాలా మంది పదోన్నతులపై వెళుతున్నా..మాకు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అన్ని అభివృద్ధి పనులతో పాటు వివిధ సర్వేలు చేయడంలో ఇంజినీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీ శివ సూర్య తేజ, జిల్లా నాయకులు రామాంజనేయులు, వెంకట రమేష్, రాజేష్, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

- కనిగిరి హైస్కూల్లో బాలికలపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- పది రోజుల క్రితమే హెచ్‌ఎం ద్వారా డీఈఓకు ఫిర్యాదు!
- అయినా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- టీచర్ ఇంటిని ముట్టడించిన బాధిత వర్గం
- పోలీస్ స్టేషన్ ఎదుట నమాజ్ చేసి నిరసన



టీచర్ రంగారెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రంగ రంగా.. వికృతంగా..!

కనిగిరి రూరల్: ఐదు పదుల వయసు నిండిన ఆ టీచర్ రోజూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతుంటే లోలోన కుమిలిపోయిన బాలికలు ఇక భరించలేక నిజం బయటపెట్టారు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కోపోద్రిక్తులై కీచక టీచర్ ఇంటిని ముట్టడించడంతోపాటు కనిగిరి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నమాజ్ చేసి మరీ నిరసన తెలపడం సంచలనం రేపింది. మంగళవారం కనిరిగి పట్టణంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు విద్యాశాఖ అధికారుల తీరును వేలెత్తి చూపాయి. ఇటీవల కొనకనమిట్ల మండలంలోని ఓ పాఠశాలలోనూ తమ ఉపాధ్యాయుడు లైంగికంగా వేధిస్తున్నాడంటూ బాధిత బాలికలు ఏకంగా బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యురాలికి ఫిర్యాదు చేశారు. దీనిపై అంతర్గత విచారణ సాగుతున్న తరుణంలోనే కనిగిరిలో మరో జుగుప్సాకర ఘటన వెలుగు చూడటంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు, విద్యాశాఖ అధికారుల వ్యవహార శైలిపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

పది రోజుల క్రితమే ఫిర్యాదు

కనిగిరిలోని ఓ పాఠశాలలో సైన్స్ టీచర్ రంగారెడ్డి వికృత చేష్టలతో బాధింపబడిన బాలికలంతా 6, 7 తరగతులకు చెందిన వారు కావడంతో గత కొంత కాలంగా బయటకు చెప్పుకోలేకపోయారు. అయితే పది రోజుల క్రితం సుమారు ఏడుగురు విద్యార్థులు ధైర్యం చేసి టీచర్ అసభ్యకర ప్రవర్తనపై హెచ్‌ఎం కలువ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె డీఈఓకు విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో టీచర్‌కు మెమో ఇచ్చి వదిలేయడం గమనార్హం. ఈ క్రమంలో పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఓ బాలికకు సోమవారం రుతుస్రావమైంది. తల్లిదండ్రులు ఆ బాలికను ప్రశ్నించడంతో.. టీచర్ వికృత చేష్టల గురించి చెప్పి కన్నీటి పర్యంతమైంది. బాలికకు వైద్యం చేయించిన తల్లిదండ్రులు మంగళవారం తమ బంధువులతో కలిసి కనిగిరిలోనే ఉంటున్న టీచర్ ఇంటిని ముట్టడించారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు, ముస్లిం యువత, స్థానికులు కనిగిరి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. నడి రోడ్డుపై ఇఫ్తార్ దువా, నమాజ్ చేసి నిరసన తెలిపారు. కీచక టీచర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా బాధిత విద్యార్థినులంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది.



పాతూరులోని టీచర్ ఇంటి వద్ద మోహరించిన పోలీసు బలగాలు

విద్యాశాఖ తీరుపై ప్రజలు, పోలీసుల ఆగ్రహం

టీచర్ బాగోతంపై డీఈఓ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు అందినా కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం మెమోతో సరిపెట్టడం నిర్లక్ష్య వైఖరిని స్పష్టం చేస్తోంది.

విద్యాశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై ఇటు ప్రజలు, అటు పోలీసు వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలలో ఓ టీచర్ నెలల తరబడి బాలికలను లైంగికంగా వేధిస్తున్నా ఇతర ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధిత తల్లిదండ్రులు, ముస్లిం యువత

జంట హత్య కేసులో నిందితుడు అరెస్టు

- మీడియా ఎదుట ప్రవేశపెట్టిన డీయస్పీ నాగరాజు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో జరిగిన జంట హత్య కేసులో నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో దాయాదుల నడుమ సెంటున్నర స్థలం కోసం వివాదం కొనసాగిందన్నారు. ఈ నేపథ్యంలో పంచాయితీని తీర్చేందుకు గుంటూరులో ఉన్న దూదేకుల నూర్జహాన్ బీతో పాటు ఆమె తోబుట్టువులు బొమ్మలాపురం వచ్చారు. ఈ నెల 6 తేదీన ఇరువర్గాల నడుమ చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో 7వ తేదీ తెల్లవారుజామున ఆరుబయట నిద్రిస్తున్న దూదేకుల నాగూర్‌వలి అతడి పెద్దమ్మ దూదేకుల నూర్జహాన్‌బీలను మరో వర్గానికి చెందిన దూదేకుల ఖాశింవలి మరికొందరు బంధువులతో కలిసి వారిపై పెట్రోలు పోసి నిప్పటించారు. దీంతో తీవ్ర గాయాల పాలైన ఇద్దరిని ఒంగోలుకు తరలించారు. వారు చికిత్స పొందుతూ మృతి చెందారు. దూదేకుల నూర్జహాన్‌బి భర్త మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో 17వ తేదీ సోమవారం నిందితుడిని చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసులో సంబంధం ఉన్న మిగిలిన నిందితులను అదుపులోనికి తీసుకుంటామని తెలిపారు. నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

హంస వాహనంపై దేవదేవుడు



హంస వాహనంపై శ్రీవారు



నరసింహుని అవతారంలో స్వామివారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పల్లకిపై శ్రీవారి ఉత్సవమూర్తిని నరసింహుని అవతారంలో అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య వెలుగొండ వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి, పల్లకి మోసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కుందురు కాశిరెడ్డి, ఉభయదాతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు, సింహాద్రిచార్యులు ఉభయ దాతలతో కలిసి స్వామివారికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్న సంతర్పణ చేశారు. బుధవారం శ్రీవారు శేష వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రక్షణ కల్పించాలని బాధితురాలి ఆవేదన



మాట్లాడుతున్న బాధితురాలు

ఒంగోలు టౌన్: నాకు, నా బిడ్డకు ప్రాణాలకు రక్షణ కల్పించాలని.. తనను లైంగికంగా, మానసికంగా వేధించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నగరంలోని రాజీవ్ గృహకల్ప అర్బన్ హెల్త్ సెంటర్ లో ఎల్జీఎస్ కే సరోజ కోరారు. మంగళవారం ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ హాలులో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడింది. అర్బన్ హెల్త్ సెంటర్‌లో లాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కోకిలగడ్డ సురేంద్ర బాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ షేక్ మహమ్మద్ అన్సారీలు తనను లైంగికంగా వేధించడమే కాకుండా మానసికంగా ఇబ్బందులు పెట్టారని తెలిపింది. ఈ విషయాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయంతో పాటు జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోవడంతో విధిలేని పరిస్థితిలో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. తాలుకా పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టడానికి వెళ్తే సీఐ అజయ్ కుమార్ దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. న్యాయస్థానానికి వెళ్లిన తనకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, నిందితులను అరెస్టు చేయాలని తాలుకా పోలీసులను ఆదేశించారని తెలిపారు. దాంతో తాలుకా పోలీసులు కేసు ఎఫ్ఐఆర్ చేశారని, అప్పటి నుంచి నిందితులు నా కుటుంబ సభ్యులతో పాటుగా నన్ను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తాలుకా పోలీసులు నిందితులకు వత్తాసు పలుకుతూ ఇప్పటి వరకు అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, రాష్ట్ర కార్యదర్శి ఈదులముడి మధుబాబు కోరారు. ఒంగోలులో మంగళవారం జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పరాజు చిన రాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమన్, మధుబాబు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మెప్మా, సెర్ప్‌లలో పనిచేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందని, ప్రస్తుతం అందరూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారని వీరికి భద్రత లేని కారణంగా అనేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. అందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రతతో పాటు, భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మంత్రివర్గం సమావేశంలో ఆప్కాస్ రద్దుపై వస్తున్న ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీకి గురయ్యేట్లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బయటకు నెట్టవద్దన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఆప్కాస్ రద్దుపై ఏర్పడిన అనిశ్చితిని ప్రభుత్వం తొలగించాలని కోరారు. జిల్లా నాయకులు రాఘవరావు, రాయుడు, నాగమల్లేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించడమే లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖాధికారులతో జీఓ 117, డ్రాపౌట్స్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఓ 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించి ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కూడా సంబంధిత విద్యా శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో అధ్యయనం చేశామని తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలుపై తల్లిదండ్రులను సంప్రదించి వారికి వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకునేలా ఎంఈఓలు పంచాయతీ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాల కమిటీల సమావేశంలో సూక్ష్మ వివరాలను వారికి అర్థమయ్యేలా వివరించి నిర్ణయాలను లిఖితపూర్వకంగా ఆమోదం పొందేలా ఎంఈఓలు చూడాలన్నారు. నిర్దేశించిన గడువు లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేలా విద్యా శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. డ్రాపౌట్ పిల్లలు ఎందుకు డ్రాప్ అవుతున్నారో గుర్తించి వారిని బడిలో చేర్పించేలా విద్యా శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్ కుమార్, మండల విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా



నడి రోడ్డులో విద్యుత్ టవర్

- ఇడుపూరు-1 పునరావాస కాలనీలో కాంట్రాక్టర్ నిర్వాకం

మార్కాపురం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న కలనూతల గ్రామస్తులు మార్కాపురం సమీపంలోని ఇడుపూరు-1 పునరావాస కాలనీలో ఉంటున్నారు. ఈ గ్రామంలో విద్యుత్ హెచ్‌టీ టవర్‌ను సంబంధిత కాంట్రాక్టర్ నడి రోడ్డుపై ఏర్పాటు చేసి తన నిర్వాకాన్ని చాటుకున్నాడు. గ్రామస్తులు ఎలా రాకపోకలు సాగిస్తారనే ఆలోచన కూడా లేకుండా హెచ్‌టీ లైన్ టవర్ ఏర్పాటు చేయడాన్ని చూసిన ప్రజలు ఇదెక్కడి విడ్డూరమంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ టవర్‌ను పక్కన ఏర్పాటు చేయాలని కలనూతలవాసులు కోరుతున్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్లు

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య తిరునాళ్లను పురస్కరించుకొని మంగళవారం ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 5 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరయ్య స్వామి ఎడ్ల జత 3759 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన జి.నాగిరెడ్డి ఎడ్లు 3751 అడుగులు లాగి రెండవ స్థానం, యర్రగొండపాలెం మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన షేక్.నజీర్‌బాషా ఎడ్లు 3500 అడుగులు లాగి మూడోస్థానం, నంద్యాల జిల్లా గడ్డివేముల మండలం పెసరాయి గ్రామానికి చెందిన సయ్యద్ కలామ్ బాషా ఎడ్లు 3250 అడుగుల లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు బహుమతులు అందజేశారు. బండలాగుడు పోటీలను తిలకించడానికి వచ్చిన ప్రజలకు గ్రామస్తులు సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు సిటీ: మార్చి 15వ తేదీ నుంచి ఎండ తీవ్రతల కారణంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని పాటించని ప్రైవేటు విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రైవేటు విద్యాసంస్థలు పాటించడం లేదని, ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. అటువంటి విద్యాసంస్థలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.